క్లుప్తంగా

ఉమ్మడి జిల్లా జట్టుకు విద్యార్థుల ఎంపిక



వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని మోడల్ పాఠశాల విద్యార్థులు ఉమ్మడి జిల్లా కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో పోటీల్లో అండర్-17లో కబడ్డీ విభాగంలో శ్రీకాంత్, శ్రావణి, ఖోఖో విభాగంలో శివ చక్కని ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్ చిన్నగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ కమలాకర్, అధ్యాపకబృందం అభినందించారు.

పాన్‌గల్ తహసీల్దార్‌గా సత్యనారాయణరెడ్డి



పాన్‌గల్: మండల నూతన తహసీల్దార్‌గా సత్యనారాయణరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుభాష్‌నాయుడు జిల్లా కేంద్రం ఎస్‌డీసీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సత్యనారాయణరెడ్డి జడ్చర్ల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

తహసీల్దార్‌కు సన్మానం..

నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణరెడ్డికి, బదిలీపై వెళ్తున్న సుభాష్‌నాయుడును డీటీ అశోక్‌నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు తిరుపతయ్య సాగర్, మహేష్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



మదనాపురం: వనపర్తి జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మండలానికి చెందిన కబడ్డీ జట్టు ద్వితీయ బహుమతి సాధించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ క్రీడా పోటీలకు కబడ్డీలో ఆలియా, అంజలి, జెడ్పీహెచ్‌ఎస్ దుప్పల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. ఖోఖో పోటీలకు మహేశ్వరి, జెడ్పీహెచ్‌ఎస్ దుప్పల్లి విద్యార్థి ఎంపిక అయ్యారు. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రాజు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మూలే ఆంజనేయులు, ఇషాక్ పాషా, శ్రీనివాసులు, పాండురంగ, రమేష్ గౌడ్, నాగేశ్వర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం



చిన్నంబావి: దీపావళి పండుగను పురస్కరించుకొని మండలంలోని పెద్దదగడలో నిర్వహించిన డీపీఎల్ క్రికెట్ పోటీలను బుధవారం మాజీ సర్పంచ్ పూజారి చిన్న నరసింహ, వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో శారీరకధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాలపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిచారు. క్రీడల్లో ఆసక్తి పెంచుకోవడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు భాస్కర్, మహేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా జీఎస్.గోపి



అమరచింత: సీపీఎం మండల కార్యదర్శిగా జీఎస్ గోపిని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ తెలిపారు. సీపీఎం మండల మహాసభ అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. చిన్న వయస్సు నుంచే ప్రజా ఉద్యమాలపై మక్కువ చూపిస్తూ తన అన్న శ్రీనివాసులు ఆశయ సాధనకు కృషి చేస్తున్న జీఎస్ గోపిని మూడోసారి ఏకగ్రీవంగా మండల కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. ఈమేరకు గోపి మాట్లాడుతూ మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుంటానన్నారు.

పకడ్బందీగా సమగ్ర కుటుంబ సర్వే

ఆత్మకూర్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర కుటుంబ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి కుటుంబం లెక్క పక్కాగా ఉండాలని అధికారులు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నవంబర్ 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం అవుతుందని, అందరూ అంకితభావంతో పనిచేసి సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాంద్‌పాషా, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి, ఎంఈఓ బాలరాజు, ఏఓ వినయ్ కుమార్, ఏఈ రుక్వేందర్ తదితరులు ఉన్నారు.

అమరచింత: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో డీపీఓ సురేష్‌కుమార్ బుధవారం సమగ్ర సర్వే విధానంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర సర్వేలో ప్రతి ఒక్కరి నుంచి సామాజిక, ఆర్థిక విద్య, ఉపాధికి సంబంధించిన వివరాలను సేకరించాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రవికుమార్, ఏపీఎం శ్రీనివాసులు, ఎంపీఓ నరసింహులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో..

మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నురుల్‌నదీం ఆధ్వర్యంలో సమగ్య సర్వేపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్‌ఐ గోపాల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



వీపనగండ్లలో కుటుంబ సర్వేపై అవగాహన కల్పిస్తున్న అధికారి లక్ష్మప్ప

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీడీఓ గోవింద్‌రావు ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమగ్ర కుటుంబ సర్వేపై శిక్షణ నిర్వహించారు. మండలంలోని 28 పంచాయతీల పరిధిలో 12,376 ఇళ్లు ఉన్నాయని, సర్వేకు మొత్తం 105 మంది సిబ్బంది పాల్గొంటారన్నారు. 10 మంది టీంకు ఒక సూపర్‌వైజర్ ఉంటారని, రోజుకు 10 ఇళ్లను సర్వే చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, డీటీ అశోక్‌నాయుడు, ఎంపీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, ఏపీఎం సక్రూనాయక్, ఏఎస్‌ఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మప్ప ఆధ్వర్యంలో ఎన్యుమనేటర్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్యుమరేటర్లకు ఇంటింటి సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మండలంలోని అన్ని గ్రామాలను కలిపి 82 బ్లాకులుగా గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ సుగుణ, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య, ఎంపీఓ రాజు, డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్వర్, తదితర అధికారులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్‌లో తహసీల్దార్ చాంద్‌పాషా



పాన్‌గల్‌లో సమావేశానికి హాజరైన సిబ్బంది

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట రూరల్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఈనెల 29న నిర్వహించిన ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఉషూ పోటీలో కొత్తకోట పట్టణ కేంద్రానికి చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థి యువరాజ్ అండర్-17 విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్‌నబీ తెలిపారు. నవంబర్ 2న మహబూబాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. సీనియర్ కరాటే మాస్టర్లు హరిష్‌యాదవ్, జాఫర్, సాధిక్, ఇంతియాజ్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

పెద్దమందడిలో..

ఈనెల 29న పెద్దమందడి మండల కేంద్రంలో మండల స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) పోటీలను నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాణం విష్ణు తెలిపారు. అన్ని విభాగాల్లో మండలం నుంచి 19మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంఈఓ బాణం విష్ణుతో పాటు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శాంతన్న, ఉపాధ్యాయ బృందం మన్యం, రవికుమార్, అనిల్‌కుమార్, రాంరెడ్డి, కిషోర్, మంజుల తదితరులు అభినందించారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

సెల్‌ఫోన్ అప్పగింత



వనపర్తి రూరల్: వనపర్తి పట్టణానికి చెందిన శంకరమ్మ సెల్‌ఫోను పోగొట్టుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీ గుర్తించిన పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలికి సెల్‌ఫోన్ అప్పగించామన్నారు.

ఆర్పీలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి



చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

కొత్తకోట రూరల్: జీవో నం.60 ప్రకారం ఆర్పీలకు రూ.26వేలు వేతనం ఇవ్వాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆర్పీలు చాలిచాలనీ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ఆర్పీలకు ఇచ్చే వేతనాలు సరిపడటం లేదన్నారు. ఆర్పీల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 1న కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో పి.లావణ్య, జగదీశ్వర్‌రెడ్డి, జలజ, యాస్మిన్, ఖాతన్, పద్మ, స్వప్న, లక్ష్మి, సౌజన్య, సోని, సుజాత, అంజూమ్ తదితరులు ఉన్నారు.

ఇబ్బడిముబ్బడిగా ఇసుక అక్రమ నిల్వలు



బొల్లారంలో నిల్వ చేసిన ఇసుక డంపు

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పేరుతో ఇసుక డంప్ చేస్తున్నారు. తూంకుంట రీచ్ నుంచి అక్రమంగా తరలించిన ఇసుకను డంపులుగా వేసి అధిక లాభాలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు మండలంలో వినిపిస్తున్నాయి. బొల్లారం, తూంకుంట, సంగినేనిపల్లి, నాగర్లబండతండాలతో పాటు పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ముందస్తుగా ఇసుకను డంపు చేశామని పలువురు అంటున్నారు. గ్రామాల్లో నిల్వ చేసిన ఇసుక డంపుల్లో పలువురు పేదలు కూడా ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను నిల్వ చేసుకున్నారు. జిల్లా అధికారులు నిజమైన ఇసుక నిల్వదారులను గుర్తించాల్సి ఉంది.

మూడు మండలాల పరిధిలో..

వీపనగండ్ల, చిన్నంబావి మండలంతో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెంట్లవెల్లి మండలంలోని గ్రామాలకు తూంకుంట ఇసుక రీచ్ నుంచే ఇసుక రవాణా అవుతుంది. పలు గ్రామాలకు అక్రమంగా రవాణా అవుతున్న ఇసుకను అరికట్టేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని అవసరమైన చోట చెక్ పోస్టులు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. రాత్రివేళల్లో నమ్మకస్తుల కనుసన్నల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకుంటున్న ట్రాక్టర్ యజమానులు అధికారుల కళ్లు కప్పి అక్రమాలకు పాల్పడుతున్నారు.

> **ఇసుక డంపులపై విచారణ..**
>
> మండలంలో ఏ గ్రామాల్లో ఇసుక డంపులు ఉన్నాయో పరిశీలించి, వాటిపై సమగ్ర విచారణ జరిపిస్తాం. అక్రమంగా ఇసుకను నిల్వ చేశారని తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. గృహ నిర్మాణాల కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. చట్టాన్ని ఉల్లంఘించే ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకుంటాం.
>
> వరలక్ష్మి, తహసీల్దార్, వీపనగండ్ల

రూ.6.06లక్షల ఆదాయం

గత సంవత్సరం తూంకుంట ఇసుక రీచ్ నుంచి గ్రామ పంచాయతీకి రూ.6.06 లక్షల ఆదాయం సమకూరినట్లు ఎంపీడీఓ శ్రీనివాసారావు తెలిపారు. ఈ డబ్బుల ద్వారా గ్రామంలో కలెక్టర్ అండర్‌గ్రౌండ్ సైడ్ డ్రైన్ నిర్మాణం కోసం టెండర్లు పిలిచినట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసే వినియోగదారులు చెల్లించే డబ్బుల నుంచి 10 శాతం డబ్బులు జిల్లా పరిషత్‌కు మరో 10 శాతం మండల పరిషత్‌కు మిగతా 80 శాతం డబ్బులు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ అవుతాయన్నారు.



నాగర్లబండతండాలో కుప్పగా పోసిన ఇసుక

పంచాయతీ భవన నిర్మాణంపై తేలని పంచాయితీ

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కిమియాన్‌పల్లికి మంజూరైన గ్రామ పంచాయతీ భవనాన్ని, మహిళా సంఘం భవనాన్ని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మించాలని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామానికి మంజూరైన ఆయా భవనాలు ఎక్కడ నిర్మించాలని విషయంలో సందిగ్ధత రావడంతో బుధవారం పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామకంఠంలోని ఖాళీ స్థలం లేదా సర్వే నెంబర్ 4లో కొంతమంది కబ్జాలో ఉన్న భూమిలో భవనాల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్తులు తెలిపారు. ఇదే సమయంలో కొంతమంది గ్రామస్తులు గ్రామంలో నిర్మించిన పల్లె ప్రకృతి వనం తొలిగించి అదే స్థలంలో నూతన భవనాలు కట్టాలని సూచించారు. ప్రజల మధ్య ఏకాభిప్రాయం రాకపోవడంతో గ్రామసభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఉన్నతాధికారుల దృష్టికి ఇక్కడి పరిస్థితిని తీసుకెళ్లి మరోసారి గ్రామ సభ నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. అప్పటివరకు ప్రజలు ఎవ్వరు కూడ ఆందోళన చెందవద్దని తెలిపారు.

చికిత్స పొందుతూ సీనియర్ జర్నలిస్ట్ మృతి

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్న శ్రీనివాసులుచారి (48) సుదీర్ఘకాలం పాటు వివిధ దినపత్రికల్లో పనిచేశారు. ప్రస్తుతం ఓ దినపత్రికలో (సాక్షి కాదు) విలేకరిగా పనిచేస్తున్నారు. రెండు నెలలుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జెడ్పీమాజీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, సీడీసీ మాజీ చైర్మన్ భీసం చెన్నకేశవరెడ్డి, పి.విశ్వేశ్వర్, గుంత మౌనిక, కౌన్సిలర్ చీర్ల నాగన్నసాగర్, రాములుయాదవ్, భీమన్ననాయుడు, గాడీల ప్రశాంత్, కె.శ్రీనివాస్‌జీ, అద్వానీ శ్రీను, పలువురు జర్నలిస్టులు కొత్తకోటలోని ఆయన నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలి

వీపనగండ్ల: కొత్తకోట మండలంలో జర్నలిస్ట్‌గా పనిచేస్తూ మృతి చెందిన శ్రీనివాసాచారి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని టీయుడబ్ల్యూజే ఐజేయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ కేంద్రంలో ఆక్రమణలకు గురవుతున్న పది శాతం ప్లాట్లు, చెరువు భూములను రక్షించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర గీతకార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. పట్టణంలో ఐదు వందలకు పైగా ప్లాట్లు అన్యాక్రాంతమయ్యాయని, అసెస్‌మెంట్ నంబర్లు ఇచ్చి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసి అమ్ముకున్నారని ఆరోపించారు. పరమేశ్వరస్వామి చెరువు శిఖం భూములు సైతం ఆక్రమణలకు గురయ్యాయని, చెరువు వద్ద అక్రమ కట్టడాలు వెలిసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇది వరకే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పలుదఫాలుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సైతం సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఈవిషయమై సమగ్రంగా విచారణ జరిపించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అదనపు కలెక్టర్‌కు ఆదేశించి త్వరలోనే అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని కలెక్టరు హామీనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆయూబ్‌ఖాన్, గంగాధర్‌గౌడ్, మణివర్ధన్‌రెడ్డి, ఖాజపాషా, కుర్షిద్, వెంకటన్న, గంగాధర్, షంషీర్, రఫీక్, నాగేశ్వర్, వంశీ, శ్రీకాంత్, రమేష్‌యాదవ్, అంబేడ్కర్, అంజి, రామకృష్ణ, పరమేష్, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేరుశనగకు రూ.10 వేల మద్దతు ధర ఇవ్వాలి



మార్కెట్‌లో పల్లిని పరిశీలిస్తున్న పరమేశ్వరాచారి

వనపర్తి రూరల్: వనపర్తి వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తెచ్చిన వేరుశనగకు సరైన ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి డిమాండ్ చేశారు. ఆయన రైతులతో కలసి మండలంలోని చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి వేరుశనగను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు 5 నెలల పాటు శ్రమించి వేరుశనగ పండించి మార్కెట్‌కు తీసుకొస్తే సరైన ధర రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. గద్వాల మార్కెట్‌లో పల్లికి ఉన్న రేటు కన్నా, వనపర్తి మార్కెట్‌లో తక్కువ ధర ఉందని ఆరోపించారు. అధికారులు స్పందించి మార్కెట్‌లో ఏ గ్రేడ్, బీ గ్రేడ్ ధరను బహిరంగంగా చెప్పి, బోర్డుపైన ధరల పట్టికను ఉంచాలన్నారు. రైతులకు విత్తనం పల్లి క్వింటాల్‌కు రూ.12 వేలకు విక్రయించి, వారి నుంచి క్వింటాల్‌కు మొదటి రకం రూ.5,800, కనిష్ఠ ధర 4వేలకు సేకరించడం సరికాదన్నారు. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర రూ.10 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మార్కెట్‌లో రైతులకు ఫిల్టర్ నీరు, రూ.ఐదు కు భోజనం అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కల్వరాల బుజ్జన్న, వెంకటస్వామి, సహదేవుడు, శుక్రునాయక్, హుస్సేన్, జగదీశ్వర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఖిల్లాఘనపురం: దేశాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బీజేపీలో చేరాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ కోరారు. బుధవారం మండలంలోని కమాలోద్దీన్‌పూర్‌లో బీజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మండల నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఆయన పాలనలో దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన ప్రజలు బీజేపి సభ్యత్వ నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి కేశవులు, దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి శివశంకర్, యువమోర్చా మండల అధ్యక్షుడు గోపి ముదిరాజ్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, రాములు యాదవ్, రాములు తదితరులు పాల్గొన్నారు



సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విధుల్లో అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



పెబ్బేరులో హెచ్‌ఎం లక్ష్మణ్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్ బుధవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించారు.

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణంలోని ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నసీర్‌న్నీసాబేగం ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలకు నూతనంగా వచ్చిన బయోసైన్స్ ఉపాధ్యాయుడు ఎండీ రహమత్ షరీఫ్, యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎండీ మైనుద్దీన్‌కు ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు జరీనాయాస్మిన్, నాజియా సుల్తానా పాల్గొన్నారు.

'పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ చేసింది శూన్యం'

వనపర్తి రూరల్: 10 ఏళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా రైతాంగానికి చేసింది ఏమి లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రైతాంగ, ప్రజా నిరసన పేరిట ఆందోళన చేస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో రైతుల నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, భీమా లిఫ్ట్ ఇరిగేషన్‌లో మిగిలిపోయిన చిన్న పంట కాల్వలను కూడా పూర్తి చేయలేని పరిస్థితుల్లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండిపోయిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేయలేని వారు ఈ రోజు రైతుల కోసం ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 10 ఏళ్లలో నిరుద్యోగులను ఏనాడు పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఆనంద్ సాగర్, నరసింహ, సొప్పరి నరసింహ ఉన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్‌యాదవ్